30 వరకూ భీమడోలు రైల్వేగేటు మూసివేత

ప్రజాశక్తి - భీమడోలు

తాడేపల్లిగూడెం-గుండుగొలను, గుండుగొలను-రాజమండ్రి రహదారులను కలిపే రోడ్డుపై భీమడోలులో ఉన్న రైల్వేగేటును ట్రాక్ అత్యవసర మరమ్మతుల కారణంగా ఈ నెల 30వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాస్తవానికి ఈ గేటును 20వ తేదీ ఉదయం ఏడు గంటల నుంచి ట్రాక్ మరమ్మతులు కారణంగా మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తొలుత ప్రకటించారు. వివిధ కారణాల వల్ల ఈ కార్యక్రమాన్ని 21వ తేదీ ఉదయం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వాహనదారులు, పాదచారులు, పశువుల పెంపకందారులు ఈ నెల 30వ తేదీ వరకు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని రైల్వే అధికారులు సూచించారు.

మిగులు భూముల్లో పేదల పంటలకు రక్షణ కల్పించాలి

పేదలకు పట్టాలివ్వాలన్న హైకోర్టు తీర్పు అమలు చేయాలి - ఇరిగేషన్ కార్యాలయం వద్ద దళితులు, గిరిజనులు, పేదలు ధర్నా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని ఎర్రకాల్వ ప్రాజెక్ట్ మిగులు భూముల్లో సాగులో ఉన్న పేదలకు పట్టాలివ్వాలని, పంటలకు రక్షణ కల్పించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన దళితులు, గిరిజనులు, పేదలు మంగళవారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సంఘం నేత అందుగుల ప్రభాకర్‌రావు అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, జిల్లా నాయకురాలు మడకం సుధారాణి, గుడెల్లి వెంకట్రావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడారు. జంగారెడ్డిగూడెం మండలంలో చక్రదేవరపల్లి, కొంగువారిగూడెం గ్రామాల్లో నిర్మించిన కరాటం కృష్ణమూర్తి ఇరిగేషన్ ప్రాజెక్టులో ముంపు లేని మిగులు భూముల్లో సాగుకు అవకాశం ఇవ్వాలని 2018 నుంచి పేదలు పోరాడుతున్నారన్నారు. ఆ భూముల్లో పశువులకు మేతగా పచ్చగడ్డి పెంచడం, అవకాశం ఉన్నచోట పంటలు వేస్తూ సాగు చేస్తున్నారని, పేదలు సాగు చేస్తున్న పంటలకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులను కోరుతూ దరఖాస్తులు పెట్టినప్పటికీ నేటికీ ఫలితం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూస్వాములు పేదలపై కక్షగట్టి పంటలను, పచ్చగడ్డిని దెబ్బతీసేలా పశువులను మేపుతున్నారన్నారు. దీంతో గత సంవత్సరం హైకోర్టును ఆశ్రయించగా పేదల సాగులో ఉన్న భూముల్లోని పంటలకు రక్షణ కల్పించాలని, వారికి సాగు హక్కు కల్పించాలని తీర్పునిచ్చిందని తెలిపారు. హైకోర్టు తీర్పునైనా తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, తహశీల్దార్, ఇరిగేషన్ అధికారులకు కోర్టు నుంచి ఉత్తర్వులు అందాయని తెలిపారు. తక్షణమే కోర్టు తీర్పును అమలు చేసి పేదలకు సాగు చేస్తున్న భూమికి హక్కులు కల్పించాలని, లేనిపక్షంలో రెండు మండలాల్లోని పేదలందరినీ ఐక్యం చేసి కార్యాచరణ రూపొందిస్తామని, అధికారుల నిరంకుశ వైఖరిపై హైకోర్టులో పిటీషన్ వేస్తామని ఆయన అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాగంటి సీత, పఠాన్ మస్తాన్, సిహెచ్.లక్ష్మీనారాయణ, మొగిలి మంగ, దొమ్మేటి వాణి, బొక్కా వెంకటేష్, బి.రాజు, బుద్దుల దుర్గమ్మ, బి.రామలక్ష్మి, సరియం దుర్గమ్మ, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని, హైకోర్టు ఉత్తర్వుల కాపీని ఇరిగేషన్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు.

ధర్నాలో నినదిస్తున్న పేదలు, నేతలు

ఏజెన్సీలో రియల్ ఎస్టేట్ వ్యాపారంపై చర్యలు తీసుకోవాలి

ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన చట్టాలకు విరుద్ధంగా విచ్చలవిడిగా సాగుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో శివాలయం ఎదురుగా ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులు చేపట్టిన అక్రమ నిర్మాణాలను ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ బుట్టాయగూడెం మండల కేంద్రంలో విచ్చలవిడిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా జరుగుతుందని, 1/70 చట్ట ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో భూ బదలాయింపు జరగకూడదని తెలిపారు. అయినా చట్ట విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం సరికాదని విమర్శించారు. ఆదివాసీ గిరిజన చట్టాలను అమలు చేయడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ అక్రమ నిర్మాణాలపై జాయింట్ కలెక్టర్‌కు తెలిపితే ఎల్‌టిఆర్ కేసులు నమోదు చేశారని, ఎస్‌డిసి కోర్టుకు రెండు, మూడు వాయిదాలకు హాజరయ్యామని చెప్పారు. ఇటీవల గిరిజనేతరులు ఆర్‌డిఒ వద్ద నుండి అనుమతులు తెచ్చుకున్నామని, అందుకే పనులు మళ్లీ ప్రారంభించామని నిర్మాణదారులు సమాధానం ఇవ్వడం సరికాదన్నారు. రెవెన్యూ ఉన్నతాధికారులు అక్రమ నిర్మాణాలపై జోక్యం చేసుకొని తక్షణమే నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలు ఆపకపోతే ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారం భాస్కర్, కారం ముత్యాలరావు, ఎస్.శ్రీనివాసరావు, పి.అక్కమ్మ, ఎం.అనూష తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న గిరిజన నేతలు

సమాజానికి కొత్త మార్గం చూపిన మహనీయుడు లెనిన్

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విశ్వ మానవాళి విముక్తి కోసం పోరాడి రష్యాలో మొట్టమొదటి దోపిడీ లేని కార్మిక రాజ్యాన్ని స్థాపించి మానవ సమాజానికి కొత్త మార్గాన్ని చూపించిన మహనీయుడు వి.ఐ.లెనిన్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. మంగళవారం స్థానిక ఉద్దరాజు రామం భవనంలో లెనిన్ 101వ వర్ధంతి నిర్వహించారు. తొలుత లెనిన్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనంతరం పెట్టుబడి-ప్రజాస్వామ్యం అంశంపై సెమినార్ నిర్వహించారు. దీనికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. రవి మాట్లాడుతూ నాటి సోవియట్ యూనియన్‌లో ఉన్న జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి విప్లవ మార్గాన్ని చేపట్టిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. రష్యాలో వివిధ గ్రూపులుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసి విప్లవబాటలో నడిపారని, మార్క్సిజం సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారిగా ఆచరణలో పెట్టిన యోధుడు లెనిన్ అని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పీడిత ప్రజల విముక్తికి మార్క్సిజం, లెనినిజమే మార్గమన్నారు. లెనిన్ మార్గాన్ని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్తా అనుసరించాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ నేటి ప్రజాస్వామ్యం నేతి బీరకాయలలో నెయ్యి చందంగా ఉంటుందన్నారు. సోషలిజంలోనే ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్య హక్కులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కె.రామాంజనేయులు, వైఎస్.కనకారావు, ఎం.ఇస్సాక్, కె.విజయలక్ష్మి, జె.గోపి, కె.లెనిన్, షేక్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కాలుష్య నివారణా బాధ్యత అందరిదీ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నేటి సమాజంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోయిందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో 'పర్యావరణ పరిరక్షణ' చట్టంపై సంబంధిత అధికారులతో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రత్న ప్రసాద్ మాట్లాడుతూ కాలుష్యం విపరీతంగా పెరగడం వల్ల మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాధికారులు పొల్యూషన్ అరికట్టడంలో తీసుకున్న చర్యలకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల సహకారాలు అందించేలా వారిని భాగస్వామ్యం చేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు మారుతున్న సంబంధిత చట్టాలపైన అధికారులకు అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అధికారులు ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని, ప్రజలకు నాణ్యమైన ఉత్తమమైన సేవలు అందించాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ బోర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం రూపొందించిన పథకాలతో పాటు మార్గదర్శకాలను కూడా సంబంధిత అధికారులు చిత్తశుద్ధితో అమలుపరచాలని సూచించారు. ఘన వ్యర్థ పదార్థాలను సేకరించి, విభజించి ఉపయుక్తమైన ఉత్పత్తులను తయారు చేయాలని సూచించారు. అలాగే కర్మాగారాల నుంచి వెలువడే కాలుష్య వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాత మాత్రమే విడుదల చేయాలని, లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు. నగరంలో ఇంటింటి నుంచి సేకరించిన పొడి, తడి వ్యర్థాలను విడివిడిగా విభజించి కంపోస్ట్ ఎరువుగా తయారుచేసి, పంట పొలాలకు ఉపయోగించవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ ఉపయోగించడం వల్ల వచ్చే అనర్థాల గురించి ప్రజలకు తెలియజేసి, ప్లాస్టిక్ వాడకాన్ని సమూలంగా రూపుమాపాలని తెలిపారు. ఈ సదస్సులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్


అచ్యుతాపురంలో వికలాంగ పింఛన్‌దారుడిని ప్రశ్నిస్తున్న టీం అధికారులు

వికలాంగుల పెన్షన్ల తనిఖీ

కొయ్యలగూడెం : వికలాంగుల పెన్షన్ల తనిఖీ మంగళవారం నిర్వహించినట్లు ఎంపిడిఒ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. రెండు బృందాలుగా ఏర్పడిన అధికారులు మొత్తం పద్దెనిమిది పంచాయతీల పరిధిలో ఉన్న వికలాంగ పెన్షన్‌దారులను తనిఖీ చేసి వారి వద్ద నుంచి వివరాలు, ధృవీకరణ పత్రాలు సేకరించడం జరిగిందన్నారు. మొత్తం మండల వ్యాప్తంగా నలభై ఏడు మంది వికలాంగులు ప్రతినెల రూ.15 వేల పెన్షన్‌ని పొందుతున్నారన్నారు. అయితే ఇందులో కొందరు పెన్షన్‌దారులు నకిలీ ధృవీకరణ పత్రాలతో పెన్షన్ పొందుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తనిఖీ నిర్వహించినట్లుగా తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఏలూరు : బ్యాంకింగ్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆర్‌బిఐ జిఎంఆర్‌కె మహాన అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం మంగళవారం స్థానిక అశోక్ నగర్ ఏరియాలో ఉన్న శ్రీగౌరీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్‌బిఐ జిఎంఆర్‌కె మహాన విచ్చేసి మాట్లాడుతూ బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. బ్యాంక్ సేవింగ్స్, బీమా పథకాలు, సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక క్రమశిక్షణ ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయ రాజు, ఎస్‌బిఐ రీజనల్ మేనేజర్ ఎన్.ప్రసాద్, జిఎం డిఐసి పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, యూనియన్ బ్యాంక్ డిప్యూటీ ఆర్‌హెచ్ఎస్.సంతోష్, నాబార్డ్ డిడిఎం టి.అనిల్ కాంత్, సెట్ వెల్ సిఇఒ కెఎస్.ప్రభాకర్, ఎల్‌డిఎం డి.నీలాద్రి పాల్గొన్నారు.

పోలీసుల వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్

ఏలూరు స్పోర్ట్స్ : సిబ్బంది వినియోగిస్తున్న తుపాకులతో వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌ను నిర్వహించామని జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు. జిల్లాలోని తడికలపూడి ప్రాంతంలో పోలీస్ ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహిస్తూ ఉంటారు. ఇందులో భాగంగానే మంగళవారం జిల్లా పోలీసులకు తాము వినియోగించే తుపాకులతోనే ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఈ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో జిల్లా కలెక్టర్ ధాత్రిరెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్‌తో పాటు ధాత్రి రెడ్డి కూడా అదే బ్యాచ్‌లో ఐపిఎస్‌గా ఎంపికయ్యారు. అనంతరం ఆమె మరలా మరో మరో ఐఎఎస్‌కు ఎంపికయ్యారు. ధాత్రిరెడ్డి ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఫైరింగ్ చేసి జిల్లా పోలీసులను అబ్బురపరిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఫైరింగ్ ప్రాక్టీస్ చేసే సమయంలో పోలీసులు వారి వారి సొంత ఆయుధాలతోనే ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించడం వినియోగంలో సరిగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కారణంచేతనే వారికి వారి సొంత ఆయుధాలతోనే ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్యంత ప్రతిభ కనబరచిన పోలీసులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, అదనపు ఎస్‌పి ఎఆర్, అదనపు ఎస్‌పి శేఖర్, డిఎస్‌పిలు శ్రావణ్ కుమార్, యుగంధర్ ఎం.వెంకటేశ్వరరావు, కెవివిఎన్‌వి.ప్రసాద్, ఎఆర్‌డిఎస్‌పి చంద్రశేఖర్, ఆర్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ముసునూరు

పేదవాడు మెరుగైన వైద్యానికి దూరం కాకూడదనేదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు మంగళవారం మండలంలోని గుల్లపూడి, గుడిపాడు, చెక్కపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి రూ.1.46 లక్షల చెక్కులను బాధితులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య భద్రత మాదన్నారు. జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మండలంలోని గుడిపాడు గ్రామానికి చెందిన ఎమ్.అంజయ్య, అక్కిరెడ్డిగూడెం, చెక్కపల్లి గ్రామానికి చెందిన ఇరువురు గతంలో వైద్యం చేసుకొని ముఖ్యమంత్రి సహాయ నిధిని కోరగా అందజేశారు. పేద ప్రజలు కొన్నికొన్ని రోగాలకు ఆరోగ్యశ్రీ ఉన్నప్పటికీ తెలియక ఆరోగ్యశ్రీ లేని హాస్పటల్లో వైద్యం చేసుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రతీ ఒక్కరికీ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందజేసి అన్ని విధాలుగా ఆదుకొని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత మా ప్రభుత్వానిదని మంత్రి అన్నారు. గత 4 నెలల క్రితం వైద్యం చేసుకున్న ప్రతీ ఒక్కరూ సిఎమ్ఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చు అని మంత్రి అన్నారు. టిడిపి నాయకులు మందలపు ధర్మరాజు, మెదరమెట్ల సురేంద్ర కొల్లి గంగారం, పులి బళ్ల లక్ష్మీ సత్యనారాయణ, బొల్లినేని బుజ్జియ్య ఎస్.సత్యం పాల్గొన్నారు.


బాధితులకు చెక్కులందజేస్తున్న మంత్రి

అర్హులైన పేదలకు సొంతిల్లే సిఎం ధ్యేయం

మార్చిలో లక్ష ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు తాళాలిస్తాం

ఎన్‌టిఆర్ హౌసింగ్ లేఅవుట్‌లో యుద్ధప్రాతిపదికన మౌలిక సదుపాయాలు

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవానికీ ఇల్లు అందించాలనే ఆశయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారని, మార్చిలో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేపడతారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు శివార్లలోని పోణంగిలో ఎన్‌టిఆర్ గృహ లేఅవుట్‌ను మంగళవారం స్థానిక ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి), జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, గృహనిర్మాణ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, తాగునీరు, డ్రెయినేజీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పోణంగి లేఅవుట్‌లో 7035 ఇళ్లకుగాను, 5667 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను ఇచ్చారని, 875 ప్రారంభించారని తెలిపారు. ఇక్కడ మౌలిక సదుపాయాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఇసుక కొరత లేకుండా వారం రోజుల్లో ఇక్కడే స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 80 శాతానికిపైగా పనులు పూర్తయిన గృహాలను పూర్తి చేయడంపై ప్రాధాన్యతివ్వాలన్నారు. పోణంగి లేఅవుట్‌లో మార్చి నాటికి రెండు వేల ఇళ్లు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లేఅవుట్లలోని ఇళ్లకు విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీ పనులను కాంట్రాక్టర్లు నిర్దేశించిన సమయంలో పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పర్యవేక్షణా లోపం ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని మంత్రి హెచ్చరించారు. విద్యుత్ సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. ఇల్లు మంజూరైన లబ్ధిదారులు 2026 డిసెంబర్ నాటికి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని, లేనిపక్షంలో ఇంటి మంజూరు రద్దు చేస్తామన్నారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఎన్‌టిఆర్ గృహ లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, ఆర్‌టిసి విజయవాడ రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ భానుప్రతాప్, తహశీల్దార్ శేషగిరిరావు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

కొమడవోలు లేఅవుట్‌ను పరిశీలించిన మంత్రి

కొమడవోలులోని ఎన్‌టిఆర్ గృహ లేఅవుట్‌ను మంత్రి పార్థసారథి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు తమ లేఅవుట్‌లో విద్యుత్, తాగునీరు, డ్రెయినేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇక్కడ వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. గృహనిర్మాణ మెటీరియల్ చోరీకి గురవుతుందని కొందరు ఫిర్యాదు చేయగా ఇక్కడ దొంగతనాలు నివారించడానికి పోలీస్ పెట్రోలింగ్ చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ లేఅవుట్‌లో మార్చి నాటికి 1500 గృహాల నిర్మాణం పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

విశాఖ ఉక్కు అంశంలో కూటమి చారిత్రాత్మక విజయం

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణను నిరోధించడం కూటమి ప్రభుత్వం సాధించిన చారిత్రాత్మక విజయమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మంత్రి విలేకరులతో మాట్లాడారు. గత ఆరు నెలల్లో సిఎం చంద్రబాబు ఆంధ్రుల సెంటిమెంట్ వివరించి విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని పునరాలోచించాలనే విషయంపై ప్రధాని, హోం శాఖ, ఉక్కు పరిశ్రమల శాఖల మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసి ప్రభుత్వాన్ని ఒప్పించి విశాఖ స్టీల్‌కు రూ.11,440 కోట్లు ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని సాధించారన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.31 వేల కోట్లు సాధించారని చెప్పారు. 1999లో కూడా నాటి వాజ్‌పేయ్ ప్రభుత్వాన్ని ఒప్పించి విశాఖ స్టీల్‌కు ఆర్థిక ప్యాకేజీ తెచ్చి ఊపిరి పోసిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సమావేశంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, నగర మేయర్ షేక్ నూర్జహాన్, అధికారులు పాల్గొన్నారు.

బకాయిలివ్వకపోతే 24 నుంచి సమ్మె

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికుల హెచ్చరిక

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రభుత్వాసుపత్రిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఐదు నెలల పెండింగ్ జీతాలు, 18 నెలల పెండింగ్ పిఎఫ్ సొమ్ము ఈ నెల 23వ తేదీలోపు విడుదల చేయకపోతే 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తుర్లపాటి బాబు తెలిపారు. స్థానిక ఏరియా ఆసుపత్రి వద్ద కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ నెల 12న పెండింగ్ జీతాలు, పిఎఫ్ గురించి వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి, ఏలూరు డిసిహెచ్ఎస్‌కు తెలియజేసినా ఇప్పటి వరకూ ఎటువంటి స్పందనా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా పారిశుధ్య విభాగం అధ్యక్షురాలు టి.మరియమ్మ, నేతలు వెంకట్రావు, సునీత, రామకృష్ణ, వి.వాణి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

23 నుంచి ప్రారంభం : డిఎల్‌పిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి - ఉంగుటూరు

లోకాయుక్త కోర్టు తీర్పు నేపథ్యంలో ఏలూరు కాలువ గట్టు వెంబడి ఉంగుటూరు, నారాయణపురం, కైకరంలో ఇరు పక్కల ఆక్రమణలను తొలగించేందుకు పటిష్ట బందోబస్తు నడుమ ఏర్పాట్లు చేసి యుద్ధ ప్రాతిపదికన తొలగించాలని మండల ప్రత్యేకాధికారి, ఏలూరు డివిజన్ పంచాయతీ అధికారి కెపి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం నారాయణపురం పంచాయతీ కార్యాలయంలో జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ హోదాలో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆక్రమణల తొలగింపు ఆలస్యం అయ్యే కొద్దీ కోర్టులకు వెళ్లే వారి సంఖ్య పెరుగుతోందని, ఇక ఎట్టి పరిస్థితిలోనూ వెనుకంజ వేయకుండా ఏయే గ్రామంలో ఎప్పుడెప్పుడు తొలగిస్తారో ఆయ పంచాయతీ కార్యదర్శులు కార్యాచరణ ప్రణాళికతో చెప్పాలని ఆదేశించారు. ఈనెల 23న నారాయణపురం, కైకరం, చేబ్రోలులో ఆక్రమణలు తీసేందుకు అధికారులు, సచివాలయం ఉద్యోగులు, సిబ్బందితో సిద్ధంగా ఉండాలని, అదే సమయంలో పోలీసు బందోబస్తు కూడా అత్యంత కీలకమని చంద్రశేఖర్ అన్నారు. అన్ని శాఖలు వచ్చినా పోలీసులు ప్రొటక్షన్ ఇవ్వకపోతే తొలగింపు పనులు నిలిచిపోతాయన్నారు. గతంలో నారాయణపురం-గణపవరం రోడ్డులో ఆక్రమణల తొలగింపులో చేపట్టిన వ్యూహాన్ని అమలు చేస్తే బావుంటుందని ఎంపిడిఒ గంజి రాజ్ మనోజ్ విజ్ఞప్తి చేశారు. మరికొంత సమయం ఇవ్వాలని నారాయణపురం పంచాయతీ పాలకవర్గం అధికారులను కోరగా తమ చేతుల్లో ఏమి లేదని కోర్టు తీర్పును అమలు చేస్తున్నామన్నారు. ఇఒపిఆర్‌డి వి.చంద్రశేఖరం, పంచాయతీ కార్యదర్శులు నేతల విజయకుమార్, బొడ్డు రవిచంద్రకుమార్, నరశింహరాజు, కాకర్ల వెంకట గిరిధర్, విద్యుత్, హౌసింగ్, ఇరిగేష్ ఎఇలు తలారి వేణు, శ్రీరామ్, చింతలపూడి సతీష్, సుధారాణి, ఆర్ఐ దావీదు రాజు పాల్గొన్నారు.

స్టేట్‌బ్యాంక్‌లో సర్వర్ల మొరాయింపు

ఇబ్బందిపడిన వినియోగదారులు

పోలవరం : మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంకులో సర్వర్లు మొరాయించడంతో బ్యాంకు సేవలు నిలిచి వినియోగదారులు మంగళవారం ఇబ్బందులకు గురయ్యారు. మంగళవారం వారపు సంత కావడంతో పోలవరం నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని ప్రాంతాలలో గ్రామాల నుంచి పోలవరం వచ్చే గిరిజనులు, డ్వాక్రా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ అవసరాల కోసం బ్యాంకుకి తరలివచ్చారు. సర్వర్లు పనిచేయక బ్యాంకు లావాదేవీలు జరగకపోవడం వల్ల డ్వాక్రా మహిళలు, వినియోగదారులు ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ వేచిచూసి వెనుతిరిగి వెళ్లారు. ఈ విషయంపై బ్యాంకు మేనేజర్ రవికుమార్‌ని వివరణ కోరగా బ్యాంకు లావాదేవీలన్నీ బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ ద్వారా జరుగుతుందని, బిఎస్ఎన్ఎల్ సిగ్నల్ ఫ్రీక్వెన్సీ లేకపోవడం, బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ పనిచేయకపోవడం వల్ల సమస్య తలెత్తిందని తెలిపారు.

ఖాళీగా ఉన్న బ్యాంక్

కలప అక్రమ రవాణా ట్రాక్టర్ స్వాధీనం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

అక్రమంగా కలపను తరలిస్తున్న ట్రాక్టర్ను స్వాధీనం చేసుకున్నట్లు కన్నాపురం అటవీ రేంజర్ శివరామకృష్ణ మంగళవారం పేర్కొన్నారు. కుంకాల బీట్ నుంచి సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత ట్రాక్టర్లో విలువైన కలపను తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ట్రక్కుతో తరలిస్తున్న బాదులను గుర్తించి కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ.20 వేలు పైబడి ఉండవచ్చు అని తెలిపారు.

78 అంకెతో కూర్చుని ఖోఖో విజేతలకు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

ప్రపంచ ఖోఖో విజేతకు అభినందన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి బాలికల ఉన్నత పాఠశాలలో భారత ఖోఖో జట్టుకి శుభాకాంక్షలు తెలుపుతూ 78 అంకెతో విద్యార్థులు కూర్చున్నారు. ప్రపంచ ఖోఖో విజేతగా భారత్ నిలిచినందుకు పరింపూడి జెడ్పి బాలికల ఉన్నత పాఠశాలలో అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నేపాల్ జట్టుపై భారత జట్టు 78 పాయింట్ల ఆధిక్యతతో గెలిచినందుకు అభినందిస్తూ అక్షరాకృతితో కూర్చుని శుభాకాంక్షలు తెలిపారు.

పాల ఉత్పత్తిదారులకు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - ద్వారక తిరుమల

మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం(విజయ డెయిరీ) ఆధ్వర్యంలో బోనస్ పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం సంఘ అధ్యక్షులు పాకలపాటి మధు బ్రహ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ మేనేజర్ మూర్తి విజయ డెయిరీ పాల కేంద్రాలకు పాలు పోసిన రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయటంతో పాటు, సంఘంకి వచ్చిన ఆదాయాన్ని రైతులకు బోనస్ రూపంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి సభ్యురాలు, కొయ్యలమూడి వెంకట సరిత, మాజీ ఎంపిపి ఛైర్మన్ దాలయ్య, పార్టీ మండల నాయకులు పోలిన శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షులు గంటా శ్రీనివాసరావు, విజయ డెయిరీ మేనేజర్ మూర్తి, రైతులు పాల్గొన్నారు.

టిడిపి మండలాధ్యక్షులు కోటేశ్వరరావుకు పరామర్శ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి మండల అధ్యక్షులు మల్లవల్లి కోటేశ్వరరావును మంగళవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముద్రబోయిన వెంకటేశ్వరరావు మండల పరిధిలోని నూగొండపల్లి గ్రామంలోని మల్లవల్లి కోటేశ్వరరావు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.మంగయ్య, జె.రాంబాబు, ఎం.కనయ్య, ఎం.అర్జునరావు, పి.శ్రీనివాసరావు, ఆర్.పెద్ద వెంకటేశ్వరరావు, యు.వెంకట్రావులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

స్థానిక ఏలూరు దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ద్వారా అవసరమైన వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ చేతుల మీదుగా జరిగింది. ముందుగా రామ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో వికలాంగుల పునరావాస కేంద్రం ఉండడం చాలా అవసరమని, దీని ద్వారా వికలాంగులకు అవసరమైన కృత్రిమ అవయవాలు, ఫిజియో థెరపీ, ఆడియోలజీ, స్పీచ్ థెరపీ తదితర సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎడి ప్రసాద్ రావు, సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాస్ రెడ్డి, ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ స్కూల్ ప్రిన్సిపల్ మాధవీలత పాల్గొన్నారు.

పీసా కమిటీలకు రీ పోలింగ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా పీసా కమిటీలకు కోరం లేక వాయిదా పడిన 8 గ్రామాలకు ఈ నెల 23, 24 తేదీలలో రీ పోలింగ్ నిర్వహించనున్నట్లు మంగళవారం ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు పోటీ చేయాలని గిరిజన కులానికి చెందిన వారై ఉండి, ఆ గ్రామంలోని ఓటర్ జాబితాలో నమోదు కాబడి ఉండాలని ఆమె తెలిపారు.

నేరాలు - ఘోరాలు

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

నిందితుడికి రిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సంక్రాంతి సెలవుల నిమిత్తం ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చిన ఇంటి యజమాని తన బీరువాలోని లక్ష రూపాయల నగదు అపహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో నాలుగు రోజుల్లో రెండో పట్టణ పోలీసులు పురోగతి సాధించి, పోగొట్టుకున్న నగదులో 40 శాతం రికవరీ చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏలూరు రెండో పట్టణ ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని చేపల తూము సెంటర్‌కు చెందిన గేదెల శ్రీనివాసరావు స్థానికంగా వెల్డింగ్ షాప్ నిర్వహిస్తూ భార్య, పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. ఈక్రమంలో సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ఈనెల 14వ తేదీన శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి 16వ తేదీ ఇంటికి చేరుకుని చూసుకునేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి, బీరువాలో ఉంచిన లక్ష రూపాయల నగదు అపాహరణకు గురైనట్లు గుర్తించారు. అదేరోజు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన రెండో పట్టణ ఎస్ఐ రామకృష్ణ నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ నేతృత్వంలో అత్యధిక పరిజ్ఞానంతో ఏలూరు నగరంలోని పాముల దెబ్బకు చెందిన మింగి దుర్గాప్రసాద్ అనే పాత నేరస్తుని అదుపులకు తీసుకుని, ప్రశ్నించగా అతను దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. మంగళవారం రాత్రి దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు.

నాటుసారా విక్రేతలపై కేసు

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా అమ్మినా, నాటుసారా తయారీకి బెల్లం అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని చింతలపూడి సిఐ పి.అశోక్ తెలిపారు. చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సుప్రీంపేటలో కొమ్మిగిరి మాధవి అను మహిళను 20 లీటర్ల నాటుసారా, చవటపాము శ్రీనివాసరావు ఆలియాస్ మసాలా శ్రీను అనే వ్యక్తిని రెండు లీటర్ల నాటు సారాయితో అదుపులోకి తీసుకొని స్థానిక చింతలపూడి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు. మండలంలో బెల్లం వ్యాపారులు జల్లు కుమార్(కుమార్ ట్రేడర్స్), వజ్రపు మహేశ్వరరావు(మహేష్ జనరల్ స్టోర్స్), బుద్ధాల శ్రీనివాసరావు(సాయి శ్రీనివాస ట్రేడర్స్), రతికంట జగదీష్(గాయత్రి కిరాణా జనరల్ స్టోర్స్) అక్కల శివాజీ(ఎఎస్ఎన్ ట్రెడర్స్) అను వ్యక్తులు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్‌కు ప్రతి 15 రోజులకు బెల్లం ఎవరికి అమ్మేది వ్యక్తుల చిరునామాల పేర్లు ఇవ్వాలని, నాటుసారా తయారీదారులకు బెల్లం అమ్మినచో శిక్షార్హులని నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. వీరందరినీ నేరం చేయకుండా అదుపు చేయుటకు స్థానిక చింతలపూడి తహశీల్దార్ ప్రమాద్వర ఎదుట 129 బిఎన్ఎస్ఎస్, 128 బిఎన్ఎస్ఎస్ ప్రకారం బైండోవర్ చేయడమైందని తెలిపారు. ఈ దాడులలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహారావు, అబ్దుల్ కలీల్ హెడ్ కానిస్టేబుల్ పి.పురుషోత్తం, కానిస్టేబుల్స్ రమేష్, సత్యనారాయణ, ఎక్సైజ్ మహిళా కానిస్టేబుల్ ఎ.శివప్రియ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814



ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో, సేవ చేయాలనే ఉద్దేశంతో పేదవాడై ఉండి కూడా ఇతరులకు సహాయం అందజేయాలని టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గార్లపాటి నరసింహారావు కొలిక్కిపాము అంథోని కుమారుడు చంటిబాబు మరణించగా కుటుంబ అవసరాల నిమిత్తం మంగళవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో మందుల పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండల పరిధిలోని పడమట దిగవల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్, ఎస్ఎస్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విజయవంతంగా నిర్వహించినట్లు ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. మండలంలోని పడమర దిగవల్లి గ్రామంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన ఐ అండ్ జనరల్ కేర్ ఎస్ఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించినట్లు చెప్పారు. అత్యవసర విభాగ వైద్యులు డాక్టర్ ఎస్‌కె.నాయబ్ రసూల్, కంటి చికిత్స నిపుణులు డాక్టర్ జమ్ రుద్ షాహిన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేసినట్లుగా వివరించారు. ఈ క్యాంపులను నూజివీడు మండల పరిధిలోని పడమట దిగవల్లి ప్రాంతంలోని ప్రజలు వినియోగించుకున్నట్లు తెలిపారు. మరికొన్ని క్యాంపులు నూజివీడు నియోజకవర్గ పరిసరాలలో నిర్వహిస్తామని, పేదలు నివసించే ప్రాంతాలలో వైద్యసేవలను ఉచితంగా అందించేందుకు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని వివరించారు. ఇతర వివరాల కోసం 96403 24266 సెల్ నంబర్‌లో వైద్య సేవలు అవసరమైన పేదలు సంప్రదించవచ్చు అన్నారు. మెడికల్ క్యాంపు నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రెలు, మేకల పెంపకందారులకు నట్టల మందు పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జీవాలకు నట్టలు ముందు అందజేస్తున్నట్లు కూటమి నాయకులు రంగు వాసు, పాశం నాగబాబు తెలిపారు. మంగళవారం మండలంలోని రమణక్కపేట పశు వైద్యశాలలో గొర్రెలు, మేకల పెంపకందారులకు ఉచితంగా పశు వైద్య సిబ్బంది బృందం ఆధ్వర్యంలో ఉచిత మందులు అందజేశారు. గొర్రెల కాపరులు, రైతులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : మండల పరిధిలోని సుంకొల్లు, జంగంగూడెం గ్రామాలలో పశు ఆరోగ్య వైద్య శిబిరం మంగళవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 200 పశువులకు, 800 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు వైద్య అధికారులు తెలిపారు. దూడలకు మందులు, చూడి కట్టని పశువులకు చికిత్స, మేకలకు, గొర్రెలకు వ్యాక్సిన్లు, చూడి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యార్థి దశ నుంచే విద్యార్థులలో రోడ్డు ప్రమాదాల పట్ల పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండడంతో వారి ప్రాణాలను కాక ఎదుటివారి ప్రాణాలను కాపాడగలిగే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని ఏలూరు రవాణా తనిఖీ అధికారులు అన్నారు. నగరంలోని సత్రంపాడు ప్రాంతంలోని ఆదిత్య కళాశాల ప్రాంగణంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహనా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహన తనిఖీ అధికారులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ వాహనాలు నడిపే విద్యార్థులు కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి మాత్రమే వాహనాలు నడపాలని వారికి సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినట్లయితే కచ్చితంగా వారు శిక్షార్హులవుతారని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపినప్పుడు జరిగే ప్రమాదాలలో ఎక్కువ శాతం యువత మృత్యువాత పడుతున్నారని, అందుకు కారణం హెల్మెట్ ధరించకపోవడంగా గుర్తించినట్లు వారు తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్క విద్యార్థి వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించటం కూడా నేరమని, అలా ప్రయాణిస్తే కచ్చితంగా వారికి జరిమానాలు విధింపబడతాయని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వాహన తనిఖీ అధికారులు బద్దు నాయక్, జగదీష్, ప్రజ్ఞ స్వామి పాల్గొన్నారు.



నూతన కమిటీతో ఆర్యవైశ్య నాయకులు

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చలవాది వెంకటరత్నం, మడుపల్లి శివరామ్‌మూర్తిలు ఎన్నికైయ్యారు. మంగళవారం ఆగిరిపల్లిలో పేర్ల సోమేశ్వరరావు కళ్యాణ మండపంలో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికకు పరిశీలకులుగా ఎన్‌టిఆర్ జిల్లా ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి నాళ్ల చిన్న సత్యంబాబు, గంపలగూడెం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు వేములపల్లి రామకృష్ణారావు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి నిరంతరం పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు ఎం.గోపాలకృష్ణ, వై.నరశింహా, టి.మురళీధర్, జె.కోటేశ్వరరావు, వై.ప్రణీత్, జె.మారుతీ, వై.మిధున్, వై.రమేష్, టివిఎస్.కిరణ్‌లు పాల్గొన్నారు.

నిరుపేదలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మండల పరిధిలోని సగ్గూరు గ్రామంలో చర్చ్ ఆఫ్ క్రైస్ట్ ఛారిటబుల్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గొర్రె డెన్నీరాజ్ ఆధ్వర్యంలో 70 మంది వితంతువులకు రగ్గులు, 50 మంది నిరుపేదలకు నూతన వస్త్రాలను మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు కోట భాస్కరరావు, సిహెచ్.ఆదాము, రంగారావు, రాజారత్నం, దయాకర్‌లు పాల్గొన్నారు.

పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న డెన్నీరాజ్

వరి పైరుకు సల్ఫైడ్ ఇంజ్యూరీ తెగులు

వ్యవసాయాధికారి ఉషారాణి

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పలు ప్రాంతాలలో వరి పైరుకు సల్ఫైడ్ ఇంజ్యూరీ వ్యాధి సోకినట్లు వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. ఈమేరకు పూళ్ల, దాని పరిసర ప్రాంతాలలోని వరి వ్యవసాయ క్షేత్రాలను ఏలూరు, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్ మంగళవారం పరిశీలించారు. సదరు వ్యాధి సోకిన వరి పైరు వేళ్లు నల్లగా మారతాయని, దీంతోపాటు వ్యవసాయ క్షేత్రంలో నడిచినప్పుడు భూమిలో నుంచి బుడగలు వస్తాయని తెలిపారు. దీని నివారణకు వ్యాధి సోకిన వ్యవసాయ క్షేత్రంలోని నీటిని పూర్తిగా తీసివేసి నేలను సీమ నెరలు వచ్చేంత వరకు ఎండ పెట్టాలన్నారు. వ్యవసాయ క్షేత్రంలో సల్ఫర్ ఎరువులను వాడకూడదన్నారు. ఆ తరువాత వ్యవసాయ క్షేత్రంలో అవసరం మేరకు కొత్త నీరు పెట్టాలని, బూస్టర్ డోస్‌గా పొటాష్‌ను వాడాలని సూచించారు.

రైతులకు సూచిస్తున్న వ్యవసాయాధికారులు

గూటాలలో పెన్షన్ల తనిఖీ

పెన్షన్లు తనిఖీ చేస్తున్న తనిఖీ అధికారులు

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పక్షవాతంకి సంబంధించి 23 పెన్షన్లు ఉన్నాయని, వాటికి సంబంధించి కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తనిఖీలు చేపట్టినట్లు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.గాంధీ అన్నారు. ముందుగా మండలంలోని గూటాల గ్రామంలో నలుగురు వ్యక్తులు పక్షవాతం బారిన పడిన వారు ఉన్నట్లుగా వారి రికార్డులలో ఉందని, వారి ఇంటి వద్దకే వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. కొత్త పట్టిసీమ, పాత పట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లి పంచాయతీల్లో ఉన్న పెన్షనర్లను కూడా పరిశీలిస్తామన్నారు. దీనికి సంబంధించి ముందుగా మండల అధికారులు పెన్షనర్లకు తెలియజేయాలని చెప్పడం జరిగిందన్నారు. మండలంలో 18 పెన్షన్లు ఎంక్వయిరీ చేశామని, వాటికి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి మురళీధర్, ఆర్థోపెడిక్ డాక్టర్ విజయ్‌కుమార్, డిజిటల్ అసిస్టెంట్ జె.లీలారాము, ఎఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి, ఎపిఎం జేమ్స్, ఎఎన్ఎంలు ఉన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

ఐఎఎస్ ఎపిఎస్ఎస్‌డిసి నిర్వాహక సంచాలకులను కలిసిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - చింతలపూడి

స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజయవాడలో మంగళవారం ఐఎఎస్ ఎపిఎస్ఎస్‌డిసి నిర్వాహక సంచాలకులు, ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.గణేష్ కుమార్, సీడ్ ఎపి ఛైర్మన్ దీపక్ రెడ్డిని కలిసి అవకాశం వున్న పరిస్థితులను వివరించినట్లు నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగ రోషన్ కుమార్ అన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం యువ ప్రతిభావంతులను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం అన్నారు. నైపుణ్య శిక్షణా కేంద్రాల ఆధారంగా ప్రతిభ ఉన్నవారికి ప్రభుత్వ ప్రోత్సాహం అందించడమని, వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047 డాక్యుమెంట్‌తో పనిచేస్తున్నారని అన్నారు. నారా లోకేష్ యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నారని తెలిపారు. చింతలపూడి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులకు కృషి చేయాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అన్నారు. వీటిపై వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

గణేష్‌కుమార్‌తో ఎంఎల్ఎ

ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి మహర్దశ

పిఎం ఉషా పథకం కింద రూ.3.20 కోట్ల నిధుల మంజూరు

పనులు నాణ్యంగా ఉండాలి : ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రధాన మంత్రి ఉచ్ఛతార్ శిక్షా అభియాన్(పిఎం-ఉషా) పథకంలో ఉంగుటూరు మండలం నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కాలేజి(ఎస్ఎఎస్)లో 11 అదనపు తరగతుల భవనంతో పాటు ప్రహరీ గోడ నిర్మాణాలకు రూ.3.20 కోట్లు మంజూరైన నిధులతో పనులు నాణ్యంగా నిర్మించాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. మంగళవారం సంబంధిత అధికారులు, కాంట్రాక్టరు, కళాశాల ప్రణాళిక అభివృద్ధి కమిటీ సభ్యులు, పంచాయతీ సర్పంచి, ప్రిన్సిపల్, అధ్యాపకుల ఆధ్వర్యంలో భవనాలు ఎక్కడ నిర్మించాలనే దానిపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ప్రస్తుతమున్న క్రీడామైదానం స్టేడియం పక్కన భవనాలు నిర్మించాలని నిర్ణయించి, ఆమేరకు మార్కింగ్ వేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ పిఎం-ఉషాలో వచ్చిన రూ.3.20 కోట్లతో జి-ప్లస్ 3 పద్ధతిలో 11 అదనపు తరగతి గదులకే డిపిఆర్ మంజూరైనా అదనంగా ఇంకో గదిని కూడా నిర్మించేలా ఫౌండేషన్ వేయమని సూచించారు. అయితే గుత్తేదారుడు మాట్లాడుతూ 9.2 శాతం తక్కువ ధరకే బిడ్ వేశానని, 12వ గది నిర్మాణం కష్టమన్నారు. అదనపు 12వ గది నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులను తాను తీసుకువస్తానని హామీ ఇచ్చి, 12 గదులకు ప్లానింగ్ అమలు చేయాలి కోరారు. ఈక్రమంలో ఈనెల 31న భూమి పూజ నిర్వహించి సెప్టెంబర్ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసేలా అధికారులు సమాయత్త ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచి దిడ్ల అలకనంద, కళాశాల ప్రణాళికా, అభివృద్ధి కమిటీ సాగిరాజు జానకీరామరాజు, ఈపూరి సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి కెపి.చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **YANUMULA SWATHI,** W/o **YENUMULA MOHINDAR NAG** resident of D.No. 4-98/C, Bantty residence Dum Dum gardens, Nuzvid Town & Mandal, Eluru District. I have changed my name from **YANUMULA SWATHI** W/o **YENUMULA MOHINDAR NAG** (Old Name) to **YENUMULA SWATHI** W/o **YENUMULA MOHINDAR NAG** (New Name). Hereafter my name is known as **YENUMULA SWATHI** W/o **YENUMULA MOHINDAR NAG** (New Name). for all purposes.

మహారాజశ్రీ తణుకు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 309/2022

Between:

చదలవాడ థామస్ ...వాది

మరియు

సిర్రా ఆశీర్వాదం అండ్ అదర్స్ ...ప్రతివాదులు

8th Defendant

కొడమంచిలి కనకరత్నం W/o మోషే, ఆచంట వేమవరం, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు గ్రంధములో 8వ ప్రతివాది మరియు I.A No.219/2022 లో 8వ రెస్పాండెంటు గాను చూపించబడియున్నారు. మీరు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు పంపించినను, వాటిని మీరుతీసుకొనక తప్పించుకు తిరుగుచున్నారు. కావున పై కేసు మీ యొక్క హాజరు నిమిత్తం **ది. 7-02-2025 తేదిన** వాయిదా అయ్యి ఉన్నది. కావున మీరు **ది. 7-02-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ యొక్క అభ్యంతరములు పై కోర్టు వారికి తెలుపవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారణ జరుగునని తెలియపర్చడము అయినది.

// By orders //

కోమట్లపల్లి వెంకటశ్రీ రామారావు

తణుకు అడ్వకేట్
ది. 21-01-2025 తణుకు
సెల్: 83099 70708

మహారాజశ్రీ సివిల్ జడ్జి వారి కోర్టు (జూనియర్ డివిజన్): పాలకొల్లు

O.S. No. 24/2024

Between:

యిళ్ళ సూర్యవతి ...వాది

Vs

వట్టికూటి విఘ్నేశ్వరి ...ప్రతివాది

To.

వట్టికూటి విఘ్నేశ్వరి భర్త: హనుమంతరావు, పండిత విల్లూరు, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టు వారు అనేక పర్యాయములు సమన్లు పంపించినప్పటికి తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారు ఆదేశముల మేరకు మీ హాజరు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు జారీ చేసియున్నారు. వాయిదా **ది. 03-02-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు అభ్యంతరములు ఉన్నయెడల తెలియజేసుకొనగలరు. లేని యెడల సదరు విషయముపై మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఆదేశాలు మేరకు)

శ్రీ I. శివ సాంబమూర్తి & కుక్కల రాంబాబు

పాలకొల్లు అడ్వకేట్స్
ది. 20-01-2025 పాలకొల్లు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్): పాలకొల్లు, ప॥గో॥జిల్లా వారి కోర్టులో

ఒ.యస్.నెం. 116/2023

బిట్వీన్:

శిద్దాని జగదీశ్వరరావు, తండ్రి: కోటి వీరభద్రం, వయసు: 62 సం.లు, ఎ.పి.హెచ్.బి.కాలనీ, పాలకొల్లు-534260, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా. ...వాది

వెర్సెస్

జవ్వాది సురేష్, తండ్రి: కోటి త్రిమూర్తులు, వయసు: 35 సం.లు, డోర్ నెం: 2-42, శివాలయం వీధి, మట్టపర్రు-534265, పోడూరు మండలం, ప॥గో॥జిల్లా.

ప్రస్తుత నివాసం: ఉల్లింగల కాసులమ్మ గారి ఇల్లు, సెకండ్ ఫ్లోర్, స్ట్రీట్ నెం.3, యాదవుల స్ట్రీట్, సుంకం పద్దయ్య వీధి, స్కూల్ దగ్గర, భీమవరం-534201, ప॥గో॥జిల్లా. ...ప్రతివాది

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన జవ్వాది సురేష్ గారికి కోర్టు వారి ద్వారా అనేక పర్యాయములు సమన్లు పంపించినప్పటికిన్నీ, అతను ఉదేశ్య పూర్వకముగా సమన్లు తీసుకొకుండా దావాను కాలయాపన చేసే ఉద్దేశ్యముతో ఉన్నందున, ఈ ప్రకటన ద్వారా ప్రతివాదికి తెలియజేయునది ఏమనగా, పై నెంబరు దావాలో మీ యొక్క హాజరు నిమిత్తము **ది. 10-02-2025 తేదీకి** శ్రీ కోర్టు వారు వాయిదా వేసినారు. కావున ఆ తేదీన శ్రీ కోర్టు వారి ముందు ప్రతివాది అయిన మీరు **ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క అభ్యంతరములు తెలియజేసుకొనవలను. లేని యెడల మీ పరోక్షమున తదుపరి గ్రంధము జరుపబడునని ఇందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

యస్.కె. రామలింగేశ్వరరావు

పాలకొల్లు వాది తరపు న్యాయ వాది
ది. 20-01-2025 పాలకొల్లు
సెల్: 9849132391

CHANGE OF NAME

I, **INJETI SUVARNA KUMARI** W/o. Injeti Ravi Kumar, D.No. 2-139, Kotha Harijanapeta, Yenuguvanilanka, Yelamanchili Mandal, W.G.Dt., A.P. I have changed my name from **INJETI SUVARNA** (Old name) to **INJETI SUVARNA KUMARI** (New name) hence after all my documents and correspondence will be countinue with my New name **INJETI SUVARNA KUMARI**

CHANGE OF NAME

I, **INJETI RAVI KUMAR** S/o. Injeti Ramarao, D.No. 2-139, Kotha Harijanapeta, Yenuguvanilanka, Yelamanchili Mandal, W.G.Dt., A.P. I have changed my name from **INJETI RAMESH** (Old name) to **INJETI RAVI KUMAR** (New name) hence after all my documents and correspondence will be countinue with my New name **INJETI RAVI KUMAR**

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఆచంట మండలం, ఇసుక గరువు, పెనుమంచిలి గ్రామానికి చెందిన బాలం బాలమురళి, తండ్రి: నాగేశ్వరరావు అను నేను నాయొక్క పాస్పోర్ట్ పడిపోయింది. పెనుమంచిలి ఇంటి దగ్గర నుండి జిరాక్స్ నిమిత్తం ఆచంట వెళుతుండగా మార్గమధ్యంలో పడిపోయింది. నా యొక్క పాస్పోర్ట్ నెంబర్ **N8690977** గల పాస్పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరు.

బాలం బాలమురళి
తండ్రి : నాగేశ్వరరావు
డోర్ నెం: 2-94
ఇసుక గరువు, పెనుమంచిలి
ఆచంట మండలం, ప॥గో॥ జిల్లా
సెల్: 75691 95867

మహారాజశ్రీ అడిషినల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏలూరు వారి కోర్టులో

I.A. No. 996/2024 In
O.S. No. 5/2022

Between:

1. మెతుకుమల్లి రామతులసీ ...Petitioner

మరియు

2. సిరంగి దానయ్య అండ్ అదర్స్ ...Respondent

పై నెంబరు దావాలో 5వ ప్రతివాదికి LRS అయిన R6 సముద్రాల మహేశ్వరి W/o Late లీలా మహేశ్వరరావు R/o D/N. 8-31/17 R.R పేట, ఏలూరు, ఏలూరు జిల్లా.

R7 సముద్రాల రాజేష్ S/o Late లీలా మహేశ్వరరావు R/o D/N. 8-31/17 R.R పేట, ఏలూరు, ఏలూరు జిల్లా.

ప్రతివాదులు అయిన మీరు నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 3-02-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేని యెడల పై నంబరు దావాలో మీ పరోక్షము విచారించబడును.

(పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం)

N.Y.V. ప్రసాద్
ఏలూరు **N. రాముడు**
ది. 20-01-2025 అడ్వకేట్స్
ఏలూరు

TMB Tamilnad Mercantile Bank Ltd
Be a step ahead in life

తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్
రిజిష్టరు ఆఫీసు: 57, వి.ఇ.రోడ్, తూతుకుడి-628002
Website : www.tmb.in

తాడేపల్లిగూడెం శాఖ, ఫోన్ : 08818 - 221408, 222890

బంగారు నగల వేలం ప్రకటన

క్రమ సంఖ్య	ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	లోన్ తీసుకున్న తేదీ	బంగారం బరువు గ్రా॥	లోను మొత్తం	కట్టవలసిన మొత్తం
1	1247003 00117451	నారాయణ అప్పారావు, S/o. రామారావు, 7-44-5/2, 11వ వార్డు, కుంచనపల్లి రోడ్, తాడేపల్లిగూడెం పిన్: 53410	27-02-2023	98.9	3,00,000/-	3,63,450.56/- + Other Expenses

పైన ఉదహరించిన బంగారు నగలపై అప్పును తీసుకున్న ఖాతాదారుడు తిరిగి చెల్లించని కారణముగా బ్యాంక్ నిబంధనల ప్రకారం ది. 04-02-2025 (మంగళవారం) సాయంత్రం గం॥ 4.30 ని॥లకు మా తాడేపల్లిగూడెం బ్రాంచి ఆవరణలో వేలం వేయబడును.

1. హెచ్చు పాటదారుడు మొత్తం సొమ్ము అదేరోజు చెల్లించి వస్తువులను పొందవలెను. 2. నగల బరువునకు, నాణ్యతకు బ్యాంకు వారి పూచీ లేదు. 3. ఏ విధమైన కారణం చూపకనే వేలం షరతులు మార్చుకొనుటకు గాని, వాయిదా వేయుటకు గాని, వేలం ఆపుటకు గాని, రద్దుచేయుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారము కలదు. 4. ఈ ఖాతాదారులలో ఎవరైననూ మరణించిన యెడల వారి వారసులకు ఈ ప్రకటన పూర్వకముగా తెలియపరచినట్లుగా భావించవలెను. 5. అప్పు, వసూలు నోటీసులు అందనివారు మరియు నోటీసులు తిరస్కరించినవారు ఈ ప్రకటనను తుది నోటీసుగా భావించి వేలము తేదీలోగా సొమ్ము చెల్లించవలెను.

తేదీ: 21-01-2025 సం/- బ్రాంచి మేనేజరు, తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్ లిమిటెడ్